## క్లుప్తంగా

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**జమ్మలమడుగు :** మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామంలో ముద్రా సంజమ్మకు రూ.5.5 లక్షల చెక్కును ఆమె ఇంటివద్ద ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి శనివారం అందజేశారు. ఇటీవల సంజమ్మ భర్త మరణించడంతో ఆమెకు ముఖ్యమంత్రి సహాయనిధికింద ఈ నగదు మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ప్రతాపరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పల్లెనిద్ర



టీ స్టాల్ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**కొండాపురం :** మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ గ్రామం గండికోట జలాశయం కింద ముంపులోకి పోవడంతో ప్రత్యామ్నాయంగా నూతన ఆర్ అండ్ ఆర్ సెంటర్‌లో డ్రైనేజీ, రోడ్లు, కరెంట్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లడంతో వెంటనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. శనివారం ఉదయం స్థానిక టీ బంకు వద్దకు వెళ్లి టీ తాగుతూ అక్కడి ప్రజలతో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆర్.హరినారాయణరెడ్డి, జోగాపురం ప్రతాప్‌రెడ్డి, బుక్కపట్నం అశోక్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### మానవత సేవలు విస్తృతం చేయాలి

**వేంపల్లె :** మానవత స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని వేంపల్లె మాజీ సర్పంచ్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లెలో మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆయన నూతన డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు కె.కృష్ణతేజ, ఉపాధ్యక్షుడు ఎస్.ఓబుళరెడ్డి, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**కమలాపురం :** హత్యకు గురైన వైఎస్సార్ సీపీ నాయకుడు శంకర్‌రెడ్డి అంత్యక్రియలకు శుక్రవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో ఆయన పాల్గొన్నారు.

### శస్త్ర చికిత్సతో కుళ్లిన పేగు తొలగింపు

**జమ్మలమడుగు :** పెద్దముడియం మండలం చిన్న పసుపల గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డికి అరుదైన శస్త్ర చికిత్సను వైద్యుడు కిరణ్‌కుమార్ చేశారు. మోహన్‌రెడ్డికి కడుపునొప్పి రావడంతో జమ్మలమడుగులోని రామేశ్వరుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చాడు. అతని కడుపును స్కానింగ్ చేయగా కడుపులో చిన్నపేగు కుళ్లిపోయినట్లు రిపోర్టు వచ్చింది. వైద్యుడు కిరణ్‌కుమార్ అతనికి ఆపరేషన్ చేసి రెండు అడుగుల మేర కుళ్లిన పేగును తొలగించారు.

### కార్నివాల్ అవార్డుకు ఎంపికైన లఘుచిత్రం

**పులివెందుల రూరల్ :** స్టార్ టీం ప్రొడక్షన్ బ్యానర్‌లో నూతనంగా నిర్మించిన జ్ఞాపకం లఘు చిత్రం కార్నివాల్ అవార్డుకు ఎంపికైనట్లు పులివెందులకు చెందిన డైరెక్టర్ వర్ధన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023 డెక్కన్ ఇంటర్నేషనల్ సినీ కార్నివాల్ అవార్డ్స్ కాంపిటీషన్‌లో జ్ఞాపకం లఘుచిత్రం ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. వచ్చేనెల 1వ తేదీన కాళహస్తిలో నిర్వహించే ఫంక్షన్‌లో ఈ అవార్డు అందుకోనున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

### 'మానవత'బోర్డు ఆవిష్కరణ

**కడప కల్చరల్ / కడప ఎడ్యుకేషన్:** కడప నగర శివార్లలోని శాటిలైట్ సిటీ వద్ద శనివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆహ్వాన బోర్డును సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందిస్తున్న మానవత సంస్థకు సంబంధించిన వివరాలతో ఈ బోర్డును ఏర్పాటు చేశారు. సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అవకాశం గల వారందరూ సమాజ సేవ కోసం కృషి చేయాలని కోరారు. మానవత సంస్థ సభ్యులు కల్లూరు బాల యల్లారెడ్డి ఈ బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

# వేసవిలో పత్తి సాగుపై రైతుల ఆసక్తి

- వ్యవసాయ బోర్ల కింద పంట సాగు
- నియోజకవర్గంలో 10వేల ఎకరాలలో సాగు
- గత ఏడాది ధరలు ఉండటంతో సాగుపై ఆసక్తి



వేసవి పంటగా సాగైన పత్తి



పత్తి సాగులో కయ్యలు ఏర్పాటుచేస్తున్న రైతు

**వేముల :** ఈ ఏడాది వేసవిలో పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ బోర్ల కింద పంటను సాగుచేస్తున్నారు. గత ఏడాది ధరలు బాగుండటంతో రైతులు ఈ ఏడాది పత్తి పంటను ముందస్తుగా సాగుచేస్తున్నారు. మామూలుగా ఖరీఫ్‌లో పత్తి పంటను జూన్, జులై నెలల్లో సాగు చేస్తారు. అయితే వ్యవసాయ బోర్లలో పుష్కలంగా నీరు ఉండటంతో రైతులు పత్తి పంటపై ఆసక్తి చూపుతున్నారు. మార్చి నెల చివరి వారం నుంచే పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు.

**వ్యవసాయ బోర్ల కింద పత్తి సాగు**

వేసవి పత్తిని వ్యవసాయ బోర్ల కింద రైతులు ముందస్తుగానే సాగుచేస్తున్నారు. గతంలో ఖరీఫ్‌లో బోర్ల కింద వేరుశనగ పంట అధిక విస్తీర్ణంలో సాగయ్యేది. అయితే సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు పత్తి పంటను ఎంచుకుంటున్నారు. సాగులో తక్కువ పెట్టుబడులతోపాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు పత్తిపైనే ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది క్వింటా పత్తి రూ.10వేలు దాటింది. దీంతో రైతులకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడా ఒక్కో రైతు ఐదారు ఎకరాలలో పత్తి పంటను సాగుచేస్తున్నారు.

**నియోజవర్గంలో 10వేల ఎకరాల్లో సాగు**

నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె, చక్రాయపేట మండలాల్లో అత్యధికంగానూ, మిగిలిన మండలాల్లో అక్కడక్కడ రైతులు పత్తిని 10వేల ఎకరాలలో సాగుచేస్తున్నారు. సాగు చేసిన ఆరు నెలలకే పత్తి దిగుబడులు చేతికి వస్తాయి. పత్తిలో దిగుబడులు పూర్తయ్యాక రెండవ కాపునకు వదులుతారు. దీంతో రెండు కాపులతో దిగుబడులు అందుతున్నాయి. కొంతమంది రైతులు సాగులో దిగుబడులు పూర్తి కాగానే రెండవ పంటను సాగు చేస్తున్నారు. ఒక పంటలో ఆదాయం పెట్టుబడులు పోగా.. రెండవ పంట దిగుబడులతో ఆదాయం ఉంటుందని రైతులు అంటున్నారు.

**ఎకరాకు రూ.20 వేలకుపైనే పెట్టుబడులు**

పత్తి సాగులో ఎకరాకు రూ.20వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. పత్తి సాగు చేశాక పంటకు తెగుళ్ల సోకకుండా మందులను పిచికారి చేయాలి. సాగులో దిగుడబులు వచ్చే సమయానికి నాలుగైదు సార్లు మందులను పిచికారి చేయాలని, పంటలో పత్తిని తీసేందుకు కూలీలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది కూలీ రేట్లు కూడా పెరిగాయి. ఒక్కో కూలీకి రోజుకు రూ.500ల కూలీ చెల్లించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. పంట సాగు మొదలు దిగుబడులు పూర్తయ్యే సరికి ఎకరాకు రూ.20వేలకుపైనే పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు అంటున్నారు.

**6 ఎకరాల్లో పత్తి సాగు చేశా..**



నాకున్న 6 ఎకరాలలో వేసవి పంటగా పత్తి సాగు చేశా. పంట సాగు చేసి 20 రోజులు కావస్తోంది. పత్తిలో ఆదాయం ఉంటుందనే సాగు చేశా. సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. కూలీల రేట్లు పెరిగాయి. ఆశించిన మేర దిగుబడులు అందుతాయనే ఆశతో ఉన్నాం.

\- చంద్రమోహన్‌రెడ్డి, గొందిపల్లె

**గత ఏడాది పత్తి ధరలు బాగుండటంతోనే..**



గత ఏడాది పత్తి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. క్వింటా పత్తి రూ.10 వేలకు పైనే అమ్ముకున్నాం. ఆ ధరలు ఉంటాయనే ఆశతో నాకున్న 5 ఎకరాలలో పత్తి సాగు చేశా. ముందుగా సాగు చేస్తే త్వరగా దిగుబడులు వస్తాయని ధరలు ఉంటాయని సాగు చేశా. దిగుబడులు వచ్చే సమయానికి ధరలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

\- గంగిరెడ్డి, గొందిపల్లె

### ప్రశాంతంగా పది పరీక్షలు

**పులివెందుల టౌన్ :** పదవ తరగతి పరీక్షలు పులివెందులలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం పట్టణంలోని పరీక్షా కేంద్రాలలో పదవ తరగతి విద్యార్థులు ఇంగ్లీషు పరీక్ష రాశారు. ఈ పరీక్షకు మొత్తం 1662 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1648 మంది హాజరయ్యారని ఎంఈఓ బండి వీరారెడ్డి తెలిపారు.

**వల్లూరు :** గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం ఇంగ్లీషు పరీక్షకు మొత్తం 306 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు.

**కొండాపురం :** మండల కేంద్రంలో మూడు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం ఇంగ్లీష్ పరీక్షకు 357 మందికిగానూ 354 మంది విద్యార్థులు పరీక్ష రాశారని మండల విద్యాశాఖ అధికారి ఓబులేసు తెలిపారు.

### సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించండి

**పులివెందుల రూరల్ :** పట్టణం, మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో డీఈఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ బోర్లకు ఉన్న బకాయిలు ఆలస్యం చేయకుండా చెల్లించి రసీదు పొందాలన్నారు. విద్యుత్ బిల్లుల విషయంలో ఎటువంటి అనుమానం ఉన్నా 9440811935, 9440814266, 9440811935 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

# 'జగనన్నే మా భవిష్యత్'కు అపూర్వ ఆదరణ

**ఎర్రగుంట్ల :** 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి ప్రజలలో అపూర్వ ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎర్రగుంట్ల మండలంలోని వలసపల్లి గ్రామంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్యతో కలసి ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సహకారంతో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు తెలియజేయాలని సూచించారు. తర్వాత జెడ్పీటీసీ తమ్మిశెట్టి బాలయ్య తన నివాసంలో ఎమ్మెల్యేకు విందు ఏర్పాటు చేశారు. అనంతరం వలసపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డికి రూ.6 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

**మూద్దనూరులో..**

**ముద్దనూరు :** రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని వివరిస్తున్నట్లు మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి తెలిపారు. శనివారం ముద్దనూరు మండలకేంద్రంలో జగనన్నే మా భవిష్యత్..., మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఇంటింటికీ వెళ్ళి స్టిక్కర్లను అతికించారు. పార్టీలకతీతంగా అమలు చేస్తున్న పథకాలను అయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఇంద్రాణి, పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు సుమంత్, పార్టీ నాయకులు నవజ్యోత్‌రెడ్డి, గుర్రప్ప, రమేష్, గృహసారథులు పాల్గొన్నారు.



నెరుసుపల్లెలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నేతలు

**చక్రాయపేటలో..**

**చక్రాయపేట :** మండలంలోని నెరుసుపల్లె, చక్రాయపేట, కుప్పం గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నెరుసుపల్లెలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, సోమేష్‌రెడ్డి, ఎంకాం నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో, అలాగే చక్రాయపేటలో సర్పంచ్ హర్షద్, మునిరత్నంరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం, ఏసోబు, ఓబులేసు, బ్రంహానందరెడ్డిల ఆధ్వర్యంలో, అలాగే కుప్పంలో పార్టీ నేతలు గంగయ్య, కృష్ణారెడ్డి, దేవారెడ్డి, తిరుపతయ్యల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



జమ్మలమడుగు : వలసపల్లెలో చిన్నారితో స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

మండల సమన్వయకర్త ఓబుళ రెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు రామాంజులరెడ్డిలు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

**జమ్మలమడుగులో..**

**మైలవరం (జమ్మలమడుగు రూరల్):** పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో కలసి మైలవరం మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు కేవలం ఒక్క వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు శివగుర్విరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి. చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, హాజీబబాషా, వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వల్లూరులో..**



వల్లూరు : స్టిక్కర్లను అంటిస్తున్న అబ్బిరెడ్డి వీరారెడ్డి

**వల్లూరు :** జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మైసూరారెడ్డి కాలనీ, లేబాక, దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటాపురం వీవర్స్ కాలనీ తదితర గ్రామాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, జేసీఎస్ ఇన్‌చార్జి ఇందిరెడ్డి శంకర్‌రెడ్డిలు మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో తిరిగి స్థానిక నేతల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి వారి అనుమతితో గృహాల తలుపులకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరికేశవరెడ్డి, పార్టీ నేతలు రామకృష్ణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

**వీరపునాయునిపల్లెలో..**

**వీరపునాయునిపల్లె :** మండలంలోని బుసిరెడ్డిపల్లె, సంగాలపల్లె గ్రామాల్లో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమించే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమణారెడ్డి, బాలంగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**చెన్నూరులో..**

**చెన్నూరు :** స్థానిక కొత్తగాంధీనగర్‌లో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో శనివారం ఎంపీపీ చీర్ల సురేష్‌యదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబు ఆధ్వర్యంలో రాచిన్నాయపల్లె సర్పంచ్ సొంతం సుదర్శన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుష్పలత, జకరయ్య, చంద్రబాబు, భాస్కర్, రత్నం, టీఎన్ చంద్రారెడ్డి, పాలగిరి ఉమామహేశ్వర్ రెడ్డి, కటారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# మామిడిలో ఫ్రూట్ కవర్లు తప్పనిసరి

**వేంపల్లె :** మామిడిలో ఫ్రూట్ కవర్లు తప్పనిసరిగా వాడాలని తిరుపతి నిమ్మ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి రైతులకు సూచించారు. శనివారం అయన హెచ్ఓ రెడ్డయ్యతో కలిసి వేంపల్లె మండలంలోని చీనీ, నిమ్మ, మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి తోటలో కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు తొడగాలని సూచించారు. ఈ కవర్ల లోపల నల్లటి కోటింగ్ ఉండటం ద్వారా ఇది సూర్యరశ్మిని భాగా శోషించడంతో కాయ రంగు పసుపు రంగులోకి మారుతుందన్నారు. అలాగే కాయలు ఎటువంటి మచ్చలు లేకుండా ఉంటాయన్నారు. చీనీ, నిమ్మ తోటల్లో డ్రిప్ ద్వారా కేవలం 1–2గంటల వరకు మాత్రమే నీటిని అందించాలన్నారు. వేరు కుళ్లు సమస్యవల్ల చెట్లు ఎక్కువగా చనిపోతున్నాయని.. కావున ట్రైకోడెర్మా, సిడోమోనస్‌లు 5 మీ లీటర్ల చొప్పున లీటరు నీటికి కలిపి చెట్టు చుట్టూ తడిసేలాగా 10 లీటర్ల మేర పోయాలన్నారు.



ఎండిన చీనీ చెట్టును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి

# టీకాలతో ఆరోగ్యం పదిలం

**వల్లూరు :** వ్యాధి నిరోధక టీకాల వలన వ్యాధుల నుంచి రక్షణ పొందడం ద్వారా ఆరోగ్యం పదిలంగా వుంటుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పలు టీకా కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు మధ్యాహ్న భోజన సమయంలో ఐరన్ మాత్రలను తినిపించాలని సూచించారు. టీకాలను నిర్ణీత సమయాల్లో ఖచ్చితంగా వేయడానికి చర్యలు చేపట్టాలని ఆశా, వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఇమ్యూనైజేషన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు అందించారు. పాపాఘ్ని నగర్‌లో బరువు తక్కువగా వున్న 10 నెలల పసి బిడ్డను గుర్తించి రిమ్స్‌లోని ఎన్ఆర్‌సీ కేంద్రానికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, హెల్త్ సూపర్ వైజర్ శివరామిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారి డాక్టర్ మల్లేశ్వరి

# ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**కమలాపురం :** మండలంలోని ఎర్రగుడిపాడులో వెలసిన శ్రీ అంకాల పరమేశ్వరీ అమ్మవారి 9వ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

**నేడు బండలాగుడు పోటీలు**

వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భారతి సిమెంట్ సౌజన్యంతో సర్పంచ్ ఎస్. వెంకటలక్షుమ్మ, మండల వైస్‌ప్రెసిడెంట్ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో రైతే రాజు నినాదంతో పాల పళ్ల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు రూ.30వేలు, రూ.20వేలు, రూ.12వేలు, రూ.8వేలు, రూ.4వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

**కోటగంగమ్మ..**

స్థానిక కోట వీధిలో వెలసిన శ్రీ కోటగంగమ్మ 13వ వార్షికోత్సవం శనివారం ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, సామూహిక కంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

### రావణ బ్రహ్మపై ఊరేగిన ముక్తిరామలింగేశ్వరుడు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు రావణ బ్రహ్మ హవాహనంపై ఊరేగాడు. వేకువజామున సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో, ఆభరణలతో అలంకరించి పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన ఆచరించారు.

### భక్తిశ్రద్ధలతో సీతారాముల పరిణయోత్సవం

**కడప కల్చరల్ :** కడప నగరం ఆకులవీధిలోని శ్రీ రామాలయంలో శనివారం శ్రీ సీతారాముల పరిణయోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అభిషేకాలు, అలంకారాల అనంతరం కొలువుదీర్చారు. అనంతరం వేద పండితుల బృందం కల్యా ణ క్రతువును క్రమంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో కల్యాణం జరుగుతున్నంత సేపు జైశ్రీరామ్ నినాదాలు మిన్నంటాయి.

# నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణుడు డాక్టర్ దినేష్ కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు, పోస్టేట్ గ్రంధి సమస్యలు, అంగ సమస్యలు తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ఫ్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు పడగడపున ఏమి తినకుండా రావాలన్నారు.

ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### ఆర్టీసీ డిపోను మూసేయాలనే ప్రయత్నం మానుకోండి

**మైదుకూరు :** మైదుకూరులోని ఆర్టీసీ డిపోను మూసివేయాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలని సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు కోరారు. శనివారం వారు మైదుకూరులో విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రధాన కూడలి కేంద్రంగా ఉన్న మైదుకూరులో ఆర్టీసీ బస్టాండు రోజూ వేలాది మంది ప్రయాణికులను గమ్యం చేరుస్తోందన్నారు. దానికి అనుసంధానంగా ఉండి ప్రయాణికులకు అందుబాటులో బస్సులను నడుపుతున్న డిపోను ఎత్తివేసేందుకు అధికారులు పావులు కదుపుతున్నారని సీపీఐ నాయకులు పి.శ్రీరాములు, ఏవీ శివరామ్, షావలి, ఐఏఎల్ నాయకుడు ఎస్.సుబ్బారావు ఆరోపించారు. ఇప్పటికే డిపో నుంచి 20 బస్ సర్వీసులను ఇతర డిపోలకు తరలించారని, ఇప్పుడు మరో 14 సర్వీసులను తరలించడానికి అధికారులు సిద్ధపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సర్వీసుల తరలింపు చర్యలను విరమించుకోవాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు ఆందోళన చేపడతాయని తెలిపారు.

### గర్భిణులకు ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు తప్పనిసరి

**బద్వేలు అర్బన్ :** ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారంతో ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలను తప్పనిసరిగా అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన ఆయన ఆయా కేంద్రాల్లో గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులలో రక్తహీనతను తగ్గించడానికి, ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉండటానికి ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం సురేంద్రనగర్, అబ్బరాతివీధి అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ వెంగయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి**

**రాజుపాళెం :** అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ అన్నారు. మండలంలోని వెంగళాయపల్లె, గాదెగూడూరు, రాజుపాళెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రాల్లోని రికార్డులను ఆమె పరిశీలించారు. గర్భిణులకు సరైన సమయంలో టీకాలు, ఐరన్ మాత్రలు ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు టీకాలు ఇచ్చే సమయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మంజుల, ఎంపీహెచ్ఈఓ శివశంకర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.